విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా 'రంపా తిరుగుబాటు' ప్రారంభించి, బ్రిటీషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి సీతారామరాజుకి జిల్లా ఎస్పీ వివిఎన్.మణికంఠ చందోలు ఘనంగా నివాళులు అర్పించారు. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం, మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి అన్నారు. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేశారని, తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడని అన్నారు. అల్లూరి చూపిన ధైర్యం, దేశభక్తి, ప్రజల కోసం పోరాడే తత్వం ఈ తరం యువతకు ఎంతో అవసరమన్నారు. అడిషనల్ ఎస్పీ ఏఆర్.శివానంద కిషోర్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఐలు సుధాకర్, భాస్కర్, చంద్రశేఖర్, జిల్లా పోలీస్ కార్యాలయ ఏఒ నాగాభుషనమ్మ, ఏఏఒ దస్తగిరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

ఫాసిజంపై విజయం స్ఫూర్తితో

స్థానిక సమస్యలపై పోరాటం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మే 9న ఫాసిజంపై విజయం సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ వరకు సభలు సమావేశాలు నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించిందని, అందులో భాగంగా బుధవారం సిపిఎం కార్యాలయంలో సదస్సు నిర్వహించడం జరిగిందని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలంలో జరిగిన సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీలో పాసిజంపై విజయం సాధించిన రోజు ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. విక్టరీ డే స్ఫూర్తితో ప్రపంచంలో అనేక దేశాల్లో పోరాటాలు చేసి ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితో మన దేశంలో కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీ ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెడుతూ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను అప్పగించడం దారుణమన్నారు. లౌకికదేశంలో మతోన్మాదం ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మధురైలో జరిగిన సిపిఎం ఆలిండియా మహాసభల్లో నిరంతరం ప్రజాపోరాటాలను బలపరచడానికి స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పార్టీ నిర్ణయాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై నిరసిస్తూ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు మే 20న సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ సమ్మెను జిల్లాలో కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వున్న స్కీం వర్కర్లు, రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంకు ఓబుల్ రాజు అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు సురేంద్ర, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, బాలసుబ్రమణ్యం, ప్రసాద్, నాగేశ్వరావు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ భూముల

సర్వేను అడ్డుకున్న రైతులు

గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన ఎమ్మెల్సీ, కడా పీడీ

రైతులు, గ్రామస్తులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్న ఎమ్మెల్సీ, కడా పీడీ

ప్రజాశక్తి- శాంతిపురం

రామకుప్పం, శాంతిపురం మండలాల సరిహద్దుల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న విమానాశ్రయం కోసం చేస్తున్న భూముల సర్వేను దండికుప్పం, సిద్ధారెడ్లపల్లి, జీడిగుడ్ల గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. సర్వే చేయొద్దంటూ అధికారులను అడ్డగించి సర్వే నిలుపుదల చేశారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మరమ్మత్, మండల టిడిపి అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు కలిసి సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు, రైతులతో సమావేశం నిర్వహించారు. విమానాశ్రయం ఏర్పడితే పరిశ్రమలు వస్తాయని దాని ద్వారా ఉపాధి యువతకు దొరుకుతుందని అభివృద్ధి చెంది అనేకమంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, అంతేకాకుండా రైతులు ఊహించినంత పరిహారం అందిస్తామన్నారు. భూములు ఇచ్చిన ప్రతి రైతు కుటుంబానికి రానున్న పరిశ్రమలోను విమానాశ్రయంలోనూ ఉద్యోగాలు ఇప్పిస్తామని రైతులకు నచ్చచెప్పారు. దీంతో రైతులు తమకు పరిహారాలు, అభివృద్ధి విమానాశ్రయం అవసరం లేదని తరతరాల నుండి వస్తున్న భూములను తాము ఎయిర్‌పోర్టుకు ఇవ్వమని తేల్చి చెప్పారు. దీంతో అధికారులు ఏమి చేయలేక మరోసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి నచ్చజెప్పి ఆ తర్వాతే సర్వే చేయిస్తామని వెనుదిరిగారు.

ఐడిఎఫ్‌సి బ్యాంకు సేవలను విస్తరించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఐడిఎఫ్‌సి బ్యాంకు తమ శాఖలను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. చిత్తూరు నాయుడు బిల్డింగ్ వద్ద నూతనంగా ఏర్పాటు అయిన ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ బ్రాంచ్‌ను జిల్లా కలెక్టర్ ఐడిఎఫ్‌సి బ్యాంక్ స్టేట్ హెడ్ గోపితో కలసి ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐడిఎఫ్‌సి బ్యాంకు జిల్లాలో రైతులకు విరివిగా రుణాలు అందించాలని, జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తి సహకారం అందిస్తామన్నారు. జిల్లాలో వివిధ రకాల బ్యాంకులకు సంబంధించి 350 పైగా బ్రాంచ్‌లు ఉన్నాయని, ఐడిఎఫ్‌సి బ్యాంక్ బ్రాంచ్‌లను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసి రైతులకు విరివిగా రుణాలు అందించాలని, రుణ సౌకర్యం అందించగలిగితే వ్యవసాయం, ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమలపై ఆధారపడిన రైతుల ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. జోనల్ హెడ్ వేణు గోపాల్ రాజు మాట్లాడుతూ ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ బ్రాంచ్‌ను చిత్తూరు పట్టణంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం చాలా గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. ఐడిఎఫ్‌సి బ్యాంకు ద్వారా చిన్న, సన్నకారు రైతులకు నుంచి చిన్నతరహా పరిశ్రమల వరకు రుణాలు కల్పించడం జరుగుతుందన్నారు. బ్యాంకులో 24 /7 పని చేసే అధునాతన సిడిఎం మెషిన్ ఉందని, ఆధార్‌తో నిమిత్తం లేకుండా ఫింగర్ ప్రింట్‌తో సేవలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి దుర్గా రామక్రిష్ణ, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు, బ్యాంక్, తదితరులు పాల్గొన్నారు.

ఐడిఎఫ్‌సి బ్యాంకును ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

అభివృద్ధిని చేతల్లో చూపిస్తున్నాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరును అభివృద్ధి చేయడమే తమ ప్రధాన అజెండా అని.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే అభివృద్ధి పనులు పూర్తి చేసి చేతల్లో చూపించామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పలు వార్డుల్లో రూ.78.94కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గురజాల, మేయర్ ఎస్.అముద బుధవారం ప్రారంభించారు. 5వ వార్డు పరిధిలో చంగల్రాయమిట్టలో సిమెంట్ కాలువ, 7వ వార్డు మురుగానిపల్లిలో నూతన బోరు, మోటారు, 8వ వార్డు మైత్రి నగర్‌లో సిమెంట్ రోడ్డు, 10వ వార్డు ఎన్.బి కాలనీలో సిమెంట్ కాలువ, 11వ వార్డు పరిధిలోని జీకేపురంలో నూతన బోరు, మోటారు, 15వ వార్డు పరిధిలో ప్రశాంత్ నగర్, జీకేనగర్‌లలో నూతన బోర్లు, మోటార్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిత్తూరు అభివృద్ధి గురించి మాట్లాడే వారు.. గత పది నెలల కాలంలో తాము చేసిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను కళ్ళు తెరిచి చూడాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు.

గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి

సమన్వయంతో పనిచేయాలి: డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా గిరిజన గ్రామాన్ని సమగ్ర, స్థిరమైన అభివృద్ధి సాధించడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తితో కలసి ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకంకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా చిత్తూరు జిల్లా, పలమనేరు మండలం, జగమర్ల గిరిజన గ్రామాన్ని సమగ్ర, స్థిరమైన అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని పలమనేరు మండలం జగమర్ల ఎస్టీ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని ఈ పథకం ద్వారా గిరిజన గ్రామంలో సామాజిక మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, జీవనోపాధిలో కీలకమైన అంశాలను గుర్తించి వీటి ద్వారా అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వాలు అందించే అన్ని సంక్షేమ పథకాలు గిరిజనలకు అందేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు గిరిజన కాలనీకి వెళ్లి పరిశీలించాలన్నారు. పలమనేరు మండల స్థాయిలో కూడా మండలస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సంబంధితశాఖ అధికారులు ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి, జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మజ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ పివి.నరేంద్ర, ఎస్ఎస్ఏ పిఓఎం వెంకటరమణ, విద్యుత్ శాఖ డీఈ చిన్నప్ప, పంచాయతీ రాజ్ డీఈ అనిత పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ మోహన్ కుమార్

పారిశుధ్య కార్మికురాలికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికురాలికి అరుదైన గౌరవం లభించింది. 15వ వార్డులో నూతన బోరు మోటర్ ప్రారంభోత్సవం సందర్భంగా.. ఇక్కడే విధుల్లో ఉన్న నగరపాలక పారిశుధ్య కార్మికరాలు మంగమ్మను పిలిచి ఆమె చేతులు మీదుగా నూతన బోరు మోటారు స్విచ్ ఆన్ చేయించారు. దీంతో కార్మికురాలి సంతోషానికి అవధులు లేకుండా పోయింది. పలు ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే స్థానిక నాయకుల చేతనే చేయించడం విశేషం. అభివృద్ధి ప్రారంభోత్సవాల కోసం వార్డులోకి వెళ్ళిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు పూలు చల్లి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్థానిక మహిళలతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరును ప్రారంభిస్తున్న పారిశుధ్య కార్మికురాలు మంగమ్మ

నేటి నుంచి సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

సిపిఎం అగ్రనేతలు ఎంఎ బేబీ, బీవి రాఘవులు రాక

రాష్ట్ర కమిటీ సమావేశాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతిలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతాయని, ఈ సమావేశాలకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, పోలీస్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరవుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు తెలిపారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో పాతికేళ్ల తర్వాత రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశాలకు ప్రతి ఒక్క కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా అడుగులు వేయాలన్నారు. కానీ కూటమి ప్రభుత్వం పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్పొరేట్ శక్తులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నాయని ఆరోపించారు. పేదల సమస్యలను అలాగే ఉన్నాయని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం అమరావతి శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. ముఖ్యంగా విభజన హామీలు పూర్తిగా విస్మరించిందన్నారు. వెనకబడిన రాయలసీమ అభివృద్ధికి పైసా నిధులు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా గురించి మాట్లాడకుండా దాటవేయడం దారుణం అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలను ఆపి, ప్రభుత్వం నడిపించాలని కోరారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు నియోజకవర్గంలో పేదల ఇల్లు పూజ చేసిన తర్వాత కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాధ్యత రహితంగా ఉందని విమర్శించారు.రాష్ట్రంలో పేదల సమస్యలు పరిష్కారం కావడం లేదని దందాలు పెరిగాయని అవినీతి విచ్చలవిడిగా ఉంటే నియంత్రించడం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కోటి మందిపై కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధరలు పెరిగిన వారి సమస్యలపై పోరాటం చేపట్టాలని సిపిఎం భావిస్తుందన్నారు. రైతాంగం గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయం తలకు మించిన భారంగా మారిందన్నారు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, ఎదుర్కొంటున్నారని సమస్యలపై సిపిఎం పలు సందర్భాల్లో ఆందోళన చేసామన్నారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు వెచ్చించకూడదు అని బిజెపి నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రోజుకు లక్ష మంది తిరుపతికి యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినిందన్నారు. దాన్ని గురించి పట్టించుకోకుండా బిజెపి నేతలు టీటీడీ నిధులు నగర అభివృద్ధికి వాడకూడదు అని చెప్పడం మంచిది కాదన్నారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించకుండా దేశంలో ఇతర ప్రాంతాల్లో కళ్యాణ మండపాల నిర్మాణం పేరుతో నిధులు మళ్లించడం అన్యాయమని, తిరుపతిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే స్విమ్స్, బర్డ్, రుయా, మెటర్నటీ ఆసుపత్రికి నిధులు సక్రమంగా కేటాయించడం లేదని పేదలకు ఉచిత వైద్యం కూడా చేయడం లేదని, పేదలు వైద్యం చేయించుకోవాలంటే లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి పెట్టుకోలేనివారు ఉన్నారన్నారు. గత ప్రభుత్వాలయంలో అంగన్వాడీలు 42 రోజులు పాటు సమ్మె చేశారని వారి సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు దీంతో పాటు మున్సిపల్ కార్మికులు విద్యుత్, ఆశ, మధ్యాహ్నం భోజనం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసిన కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రానున్న రోజుల్లో సిపిఎం చేపట్టబోయే పోరాటాలకు కలిసి వచ్చే శక్తులను కలుపుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని చెప్పారు.

నేడు ప్రదర్శన బహిరంగ సభ

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు సందర్భంగా 8న రాష్ట్ర కార్యదర్శి వర్గం జరగనుందని, అదే రోజు సాయంత్రం మూడున్నర గంటలకు ఎమ్మెస్ సుబ్బలక్ష్మి విగ్రహం నుంచి భారీ ప్రజాప్రదర్శన తర్వాత కచ్చిపి ఆడిటోరియంలో సభ నిర్వహిస్తున్నట్లు నేతలు తెలిపారు. ఈ సమావేశాలకు సిపిఎం అగ్రనేతలు హాజరవుతారని పేర్కొన్నారు. 8, 9, 10వ తేదీలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం పలవల్లి రామకృష్ణారెడ్డి హాల్లో జరుగుతుందని చెప్పారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, ఆర్.లక్ష్మి, పి.సాయిలక్ష్మి, మాధవ, పి.వేణు గోపాల్, రవి పాల్గొన్నారు.

అందరి విజయమే.. లక్ష్యం..

- పది ఫలితాల్లో తప్పిన విద్యార్థులపై ప్రత్యేక కార్యాచరణ
- రోజుకు రెండు సబ్జెక్టులు.. నిత్యం పరీక్షలు

నేటి అభివృద్ధి సమాజంలో విద్య అధిక ప్రాధాన్యతను సంతరించుకుంది. విద్యలో రాణించిన విద్యార్థి భవిష్యత్తులో తమ మార్గాలను సుముకతం చేసుకోగలడు. అందులోనూ విద్యార్థి దశ దిశను మార్చగల పది పరీక్షలపై మరింత ప్రభావం ఉంటుందనడంలో సందేహం లేదు. అలాంటి విద్యనే నేడు అనేకమంది విద్యార్థులు చిన్న చూపు చూస్తుండడం గమనార్హం. ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణలు చేపట్టిన అందుకు విద్యార్థులు సుముఖత చూపించకపోవడం మరింత బాధాకరం.

ప్రత్యేక తరగతిలో 10 సప్లిమెంటరీ విద్యార్థులు

ప్రజాశక్తి- పూతలపట్టు: పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సంసిద్ధులను చేయాలని ఆదేశించింది. పరీక్షల సమయం దగ్గర పడడంతో ఉపాధ్యాయులు కూడా ఎవరికి వారు తమ సబ్జెక్టుల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని కృషి చేస్తున్నారు. వేసవి సెలవులున్నా ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిత్యం పాఠశాలలకు వచ్చి విద్యాబోధనలు నేర్పించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు విద్యార్థులు సుముఖత చూపడం లేదు. దీంతో ఉపాధ్యాయుల్లో సైతం అసహనం నెలకొంది.

అన్ని పాఠశాలల్లో తరగతి గదులు

ప్రభుత్వ ఆదేశాలతో పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లి, బంగారుపాలెం, యాదమరి, ఐరాల, పూతలపట్టు మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మొదటిసారి సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాసైన విద్యార్థులను రెగ్యులర్‌గా పాస్ అయిన విద్యార్థులుగానే పరిగణించడంతో వారంతా ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రావడంతో ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. పలు పాఠశాలల్లో అనేకమంది ఒక్కొక్క సబ్జెక్టులో 10లోపు మార్కులు తేడాతో తప్పిన వారు ఉన్నారు. ఇలాంటివారు సప్లమెంటరీ పరీక్షల్లో కచ్చితంగా ఉత్తీర్ణులు కావాలంటే లక్ష్యంతో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు దత్తత తీసుకుని రోజువారి కార్యాచరణ అమలు చేస్తున్నారు.

రోజుకు రెండు సబ్జెక్టులు.. నిత్యం పరీక్షలు

రోజుకు రెండు సబ్జెక్టులు చొప్పున బోధించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆ దిశగా తరగతులు నిర్వహిస్తున్నారు. రోజు ఉదయం 8 నుంచి 9.15 గంటల వరకు ఒక సబ్జెక్టు బోధించి 9.15 నుంచి 9.45 గంటల వరకు ఆ సబ్జెక్టు పై పరీక్షల నిర్వహించేలా ఏర్పాటు చేశారు. అనంతరం 10 నుంచి 11.15 గంటల వరకు రెండో సబ్జెక్టు పై తరగతి నిర్వహించి 11.15 నుంచి 11.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఈ పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి దానికి అనుగుణంగా బోధిస్తున్నారు. ఈనెల 19 నుంచి 28 వరకు నిర్వహించే సప్లమెంటరీ పరీక్షలను సమర్థంగా చేరుకునేలా విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు.

తల్లిదండ్రులు దృష్టి సారించాలి..

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నా.. కొంతమంది విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరు కావడం లేదు. ఉపాధ్యాయులు నిత్యం పిల్లల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి పిల్లలను పంపించాలని కోరుతున్న ప్రయోజనం చేకూరడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రత్యేక తరగతులకు హాజరైతే తప్పనిసరిగా ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు. పూతలపట్టు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మొత్తం 102 మంది పరీక్షలకు హాజరు కాగా ఇందులో 72 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన 30 మంది ప్రత్యేక తరగతులకు హాజరుకావాలని కోరుతున్న కేవలం 10 నుంచి 14 మంది మాత్రమే హాజరవుతుండడం ఇందుకు నిదర్శనం.

తగిన సహకారం అందడం లేదు..

- మధు, ఎంఈఓ పూతలపట్టు

అందరూ ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ఫలితాల సాధనపై సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేశాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని సబ్జెక్టుల వారీగా నిర్దేశించిన రోజుల్లో తరగతి గదులకు పంపాలి. చాలా మంది విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరు కావడం లేదు.

'అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్'

అత్యవసర పరిస్థితిలో ప్రాణాలకు రక్ష : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాజన్న ఫౌండేషన్స్ ద్వారా కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చిత్తూరు జిల్లాకు ఒక అంబులెన్స్, పాఠశాల ఆధునీకరణకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ.35లక్షల విలువ గల అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబ్యులెన్స్‌ను చిత్తూరు, పూతలపట్టు శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్, కె.మురళి మోహన్‌లతో కలసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, అమర్ రాజా ఆస్పత్రి ఎండి డాక్టర్ రమాదేవి, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న ఫౌండేషన్ ద్వారా కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు రూ.35 లక్షలతో అంబులెన్స్, పూతలపట్టు నియోజకవర్గం పి.కొత్తకోట పాఠశాలకు రూ.15 లక్షలు మొత్తం రూ.50 లక్షల రూపాయలు అందించడం జరిగిందన్నారు. అంబులెన్స్‌లో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, అడ్వాన్స్ సిఆర్‌పి సౌకర్యం ఉన్నాయన్నారు. జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం కోరిక మేరకు రాజన్న ఫౌండేషన్ ద్వారా అందించిన అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడడంలో సహాయపడుతుందన్నారు. పూతలపట్టు ఎంఎల్ఏ మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గం పి.కొత్తకోట నుండి చంద్రగిరి నియోజకవర్గం వరకు ఉన్న జాతీయ రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, క్షతగాత్రులకు అత్యవసర వైద్య సహాయంతో ఆసుపత్రికి తరలించడానికి ఈ అంబులెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అమర్ రాజా ఆస్పత్రి ఎండి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర వైద్య సేవలను అందించడంలో వైద్య వ్యవస్థ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నానన్నారు. చిత్తూరు జిల్లా తన పుట్టినిలు అని, అత్యవసర వైద్యసేవలు అందించడంలో అమరా ఆసుపత్రి తరపున సహాయం అందించగలమని పేర్కొన్నారు. డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషశ్రీ, అపోలో హెడ్ నరేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలను ప్రారంభిస్తున్న అమర రాజా హాస్పిటల్ ఎండి డాక్టర్ రమాదేవి

పరిహారం ఏదీ?

- మామిడి , అరటి, కాకర పంటలకు భారీ నష్టం
- ఆరు రోజులు అవుతున్నా స్పందించని ప్రభుత్వం

ప్రజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లాలో పలమనేరు మండలంలో గత శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ వర్షానికి పలమనేరు మండలంలో రైతులకు చెందిన మామిడి, అరటి, కాకర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరు రోజులు అవుతున్నా ఇంతవరకూ తమ వైపు అటు అధికారులు కాని, ప్రభుత్వ నాయకులు కాని కన్నెత్తి కూడా చూడలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

మామిడి, అరటి. కాకర పంటలకు తీవ్ర నష్టం

పలమనేరులో గత శుక్రవారం గాలితో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి మండలంలోని మొసలిమడుగు గ్రామానికి చెందిన మురగేసుల రైతుకు చెందిన ఒక ఎకరం అరటి తోట, 3 ఎకరాల మామిడి తోటలో మామిడి కాయలు నేల రాలిపోయాయి. మొసలి మడుగు గ్రామానికి చెందిన రైతు ఉమాపతి నాయుడు ఐదు ఎకరాల మామిడి తోట కాయలు పూర్తిగా నేలరాలాయి. మురగేసు అనే రైతుకు చెందిన మూడు ఎకరాల మామిడి తోట, ఎకరం అరటి తోట, అర ఎకరం కాకర తోట పూర్తిగా నేల పాలైంది. రైతు చంద్రశేఖర్ నాయుడు అనే రైతుకు చెందిన ఐదు ఎకరాల ఎకరాల మామిడి తోట పూర్తిగా నేల రాలాయి. రైతు మునస్వామి నాయుడుకు చెందిన మూడు ఎకరాల మామిడి తోట కాయలు పూర్తిగా నేల రాలాయి. వీటితో పాటు పలు రకాల పంటలు అకాల వర్షానికి నేలపాలయ్యాయి. మొసలి మడుగు గ్రామానికి చెందిన చంద్రవేణెమ్మ అనే రైతుకు చెందిన 13 ఎకరాల మామిడి తోట కాయలు పూర్తిగా నేల రాలాయి. పలమనేరు రూరల్ మండలం నాలగాంపల్లికి చెంది న దొరస్వామినాయుడికి చెందిన 30 ఎకరాల మామిడి తోటలో కాయలు కొంత భాగం నేల రాలాయి. పలమనేరు రూరల్ మండలం గాంధీనగర్ సమీపంలోని జి మధుసూదన్ రావుకు చెందిన 20 ఎకరాల మామిడి తోటలో మామిడి కాయలు పూర్తిగా నేల రాలాయి. ముప్పైశాతం మేర పంట పంటకు నష్టం వాటిల్లింది. లక్షల రూపాయల్లో నష్టం రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొంతైనా పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆరు రోజులు అవుతున్నా స్పందించని ప్రభుత్వం

రైతుల పంటలకు నష్టం వాటిల్లి ఆరు రోజులు అవుతున్నా ఇంతవరకూ అటు అధికారులు, ఇటు ప్రభుత్వ నాయకులు కాని తమ వైపు కన్నెత్తి కూడా చూడలేదని బాధిత రైతులు వాపోతు న్నారు..పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూత దశలో, పిందెల దశలో వేల రూపాయలు అప్పులు తెచ్చి మందులు పిచికారీ చేసి కాపాడినా చివరలో ఇలా గాలివాన ఊహించని నష్టం తెచ్చి కష్టాల్ని మిగల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30 ఎకరాల్లో పంట నష్టం

ఆరు రోజుల క్రితం కురిసిన గాలివానకు 30 ఎకరాల మామిడి తోటలో కాయలు కొంత భాగం నేలమట్టం అయ్యాయి. వాటిని ఇంతవరకూ ప్రభుత్వ అధికారులు చూసిన పాపాన పోలేదు. వెంటనే స్పందించి ఆదుకోవాలి..

- దొరస్వామినాయుడు, నలగాంపల్లి గ్రామం, పలమనేరు రూరల్ మండలం.

ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి..

ఇటీవల కురిసిన గాలివానకు 20 ఎకరాల మామిడి తోటలో కాయలు నేలరాలాయి. ఎంతో శ్రద్ధతో కాపాడినా నష్టం తప్పలేదు. నష్టం జరిగి వారం అవుతున్నా ఇంతవరకు ప్రభుత్వ నాయకులు కాని, అధికారులు కాని రాలేదు. వెంటనే నష్టం అంచనా వేసి తగు నష్టపరిహారం చెల్లించాలి..

-జి మధుసూదన్ రావు, గాంధీనగర్, పలమనేరు రూరల్ మండలం.

మామిడి కాయలు అన్నీ రాలిపోయాయి



వున్న ఐదు ఎకరాల్లో మామిడి తోట కాయలు పూర్తిగా నేలపై రాలిపోయాయి. తీవ్ర నష్టం వచ్చింది. వెంటే అధికారులు తగు నష్ట పరిహారం చెల్లించాలి..

- ఉమాపతి నాయుడు, మొసలి మడుగు గ్రామం.

ఐదు ఎకరాల్లో నష్టం..

ఇటీవల గాలి వాన కు వున్న ఐదు ఎకరా ల మామిడి తోట కాయలు పూర్తిగా నేల రాలాయి. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి..

- చంద్ర శేఖర్ నాయుడు, రైతు.

మామిడి, అరటి, కాకర పంటలకు నష్టం

మూడు ఎకరాల మామిడి తోట, ఎకరం అరటి తోట , అర ఎకరం కాకర తోట పూర్తిగా నేల పాలైంది.. ప్రభుత్వం అంచనా వేసి త్వరగా పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- మురగేసు, రైతు.

మూడు ఎకరాల మామిడి కాయలు రాలిపోయాయి..

ఇటీవల కురిసిన గాలి వానకు మూడు ఎకరాల మామిడి తోట కాయలు పూర్తిగా నేల రాలాయి. భారీ నష్టం వచ్చింది. ఇలాంటివి ఎదురై నప్పుడు ప్రభుత్వం తక్షణం అదు కోవాలి....

-మునస్వామి నాయుడు, రైతు.

13 ఎకరాల్లో మామిడి పూర్తిగా నేలమట్టం

వున్న 13 ఎకరాల్లో మామిడి తోట పూర్తిగా నేల రాలి పోయాయి. అంతా నష్టం వచ్చేలా వుంది.. ప్రభుత్వం నష్టం అంచనా వేసి ఆదుకోవాలి..

- చంద్రవేణమ్మ, మొసలి మడుగు.

ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం
'ప్రజాశక్తి 'వార్తకు స్పందన

మాట్లాడుతున్న నగరి డిఎస్‌పి సయ్యద్ మహమ్మద్

ప్రజాశక్తి -వెదురుకుప్పం : 'తొలగని ట్రాఫిక్ కష్టాలు!' అనే శీర్షిక తో మంగళవారం 'ప్రజాశక్తి' లో వార్త ప్రచురిత మైంది. దీనిపై నగరి డిఎస్‌పి సయ్యద్ మహమ్మద్ అజీజ్ స్పందించారు. పచ్చికాపల్లం లో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం బుధవారం మహాభారతం ప్రాంగణంలో వ్యాపారులతో, స్థానికులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం దుకాణాల యజమానులు, సహకారం అవసరమని కోరారు. ఈ కార్యక్రమం లో ఆయన వెంట ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి సాయి భవాని, స్థానికులు ఉన్నారు.

వర్మి కంపోస్ట్ ఎంతో లాభదాయకం

వర్మి కంపోస్ట్‌లో వానపాములు వదులుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-తవణంపల్లి: వర్మి కంపోస్ట్ కేంద్రం ఎంతో లాభదాయకమని జి రాఘ వేందర్ రాజు అన్నారు. మండలంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వానపాములు వదిలారు. సుమారు 60 రోజులలో వర్మి కంపోస్ట్ తయారవుతుందని ఎంపీడీవో జి రాఘవేందర్ రాజు తెలిపారు, వర్మీ కంపోస్ట్ వల్ల రైతులకు ఎంతో లాభదాయకమని, ప్రైవేటు ఎరువులను వాడటం వల్ల భూమి సారవంతం తగ్గుతుందని, వర్మి కంపోస్ట్ వాడటం వల్ల భూమి సారవంతంగా మారి రైతులకు పంట అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి సర్పంచ్ ఎస్ ధనలక్ష్మి, సెక్రటరీ ప్రభు ప్రేమ కుమారి, రైతులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ పద్ధతులపై అవగాహన అవసరం: ఏడీప

ప్రజాశక్తి-పూతలపట్టు : రైతులు డిజిటల్ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఏడిఏ నాగ పద్మిని రైతులకు సూచించారు. చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా పూతల పట్టు మండలం బైటపల్లి గ్రామ పంచాయతీ రైతు సేవ కేంద్రంలో పంటల సాగులో ఆధునిక టెక్నాలజీ పై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్ ద్వారా పంటల సాగులో రైతులకు ఉపయోగపడే యాప్‌ల గురించి సమగ్రంగా వివరించారు. వ్యవసాయ ఛానల్స్ అయినా పాడిపంటలు, తెలుగు బడి , రైతు నేస్తం, యూట్యూబ్ వంటి ఛానల్స్ ద్వారా నూతన వ్యవసాయ పద్ధతిలో తెలుసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. డిజిటల్ పేమెంట్స్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, రసాయనిక పదార్థాలు కొనుగోలు చేయడం వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వ్యవసాయ మెలకువలు కూలంకషంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో బయటిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ రామ తులసి సచివాలయ సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం చేపట్టాలని ఏడి విజయ శంకర్ రెడ్డి అన్నారు. మండలంలోని రాగి మాను పెంట పంచాయతీలోని రైతు సేవా కేంద్రంలో రైతు స్కిల్ వ్యవసాయంపై ఆర్ పి యాస్మిన్ ఆధ్వర్యంలో అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు స్మార్ట్ ఫోన్‌లో ఉపయోగాలు డిజిటల్ పేమెంట్లు ఫోన్ పే ద్వారా లావాదేవీలు ఎలా చేయాలో రైతులకు తెలిపారు. యూట్యూబ్‌లో రైతులకు పనికి వచ్చే వ్యవసాయనికి సంబంధించి అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో రైతు సేవా కేంద్రం విలేజ్ వ్యవసాయ అసిస్టెంట్ స్వాతి, ఎంపీఈవో రాణి ప్రమీల, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందించండి..
మొగిలి గ్రామస్తుల అభ్యర్థన

ధర్నా నిర్వహిస్తున్న గామస్తులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: నిత్యావసర సరుకులు అందించి ఆకలి మంటలు తీర్చాలని మొగిలి గ్రామ స్తులు అభ్యర్థించారు. తమకు నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్ట లేదని తహశీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం వారు ధర్నా నిర్వహిచారు. అనంతరం తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేషన్ లబ్ధిదారులు మాట్లాడుతూ గత ఒక సంవత్సరంగా నిత్యావసర సరుకులు పంపిణీలో లోపం వుందని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందనలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా నిత్యావసర సరుకులు అందించి పేదల ఆకలిని తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మంజునాథ్ ప్రసాద్, ధనుంజయనాయుడు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అవగాహనను సద్వినియోగం చేసుకోవాలి
- ఉద్యాన అధికారి లోకేష్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఆయిల్ ఫామ్ పంటపై రైతులకు అవగాహనను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి లోకేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు ఆయిల్ ఫామ్ పంట రైతులకు అవగాహన నిర్వహించ నున్నామని, మండల రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా గంగజాతర

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని టికెఎంపురంలో బుధవారం గంగజాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పిండి వంటలతో ప్రసాదాలు తీసుకెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అంబళ్లు పోశారు. సాయంత్రం ఘటం (కుండను) ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని పుష్పపల్లకిపై ఊరేగించారు. వెండి తొడుగు ఆభరణాలు, పట్టుపీతాంబరాలతో అలంకరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా కేరళ వాయిద్యాలు, డప్పుల మోతతో గ్రామ వీధుల్లో గంగమ్మను ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతి క కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమానికి తోటోళ్లగా రాజేంద్ర కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

స్వయం ఉపాధితోనే మహిళల ఆర్థికాభివృద్ధి

ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -శాంతిపురం: స్వయం ఉపాధితోనే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతా రని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడీ వికాస్ మరమ్మ తులు అన్నారు . చౌడంపల్లి తులసి రాళ్లబుదు గురు ప్రాంతా లలో నూతనం గా ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ కేంద్రాలను బుధవారం వారు ప్రారంభించారు అనంతరం శాంతిపురం మండల వెలుగు కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని, అందుకోసమే ఉచిత టైలరింగ్ శిక్షణ, ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ్ కుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, ఇతర నాయకులు ఆర్ఎస్ మనీ, గోపాల్, నాయకురాళ్లు శ్యామల, అనసూయ, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఏనుగుల దాడి
మామిడి తోటలు ధ్వంసం

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలం దేవళం పేట పంచాయతీ పాలెం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు మామిడి తోటలను ధ్వంసం చేశాయి. కోటపల్లికి చెందిన రైతులు వెంకట రమణ నాయుడు, భాస్కర్ నాయుడు, సుబ్రహ్మణ్యం అనే రైతులకు చెందిన మామిడి తోటలలో ఏనుగులు గుంపు ప్రవేశించి విధ్వంసం చేసి రైతులకు అపార నష్టాన్ని కలిగించాయి. కోత దశలో ఉన్న మామిడికాయలను కొమ్మలతో సహా విడిచి పడేశాయి. ఈ ఏనుగులు పగలంతా అడవుల్లో తిష్ట వేసి అర్ధరాత్రి దాటిన తర్వాత రైతులు పండించిన పంటల పైన పడి ధ్వంసం చేసి రైతులకు ఆవేదన తెప్పిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఏనుగులు వల్ల రైతులు నష్టపోతూనే ఉన్నారు. అటవీ శాఖ అధికారులు ప్రభుత్వం ద్వారా రైతులకు నష్టపరిహారం ఇప్పించి, రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఉచిత ఫ్రీజర్ బాక్స్‌లు ప్రారంభం

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి మండలంలో ఉచితంగా ఫ్రీజర్ బాక్స్ లను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రారంభించారు. బుధవారం ఉదయం కీనాటంపల్లె పంచాయతీ, సంతగేటులో గల జే.సి. సప్లయర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఫ్రీజర్ బాక్స్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథుగా హాజరయ్యారు. ఉచిత ఫ్రీజర్ బాక్స్ లను ప్రారంభించిన ఎమ్మెల్యే జే.సి. సప్లయర్స్ యాజమాని సురేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదమరి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర సమయంలో ఫ్రీజర్ బాక్స్ ల ఉపయోగాన్ని గుర్తు చేస్తూ, ఈ రకమైన సేవా కార్యక్రమాలు ప్రజల అవసరాలను తీర్చడంలో ఎంతో మేలు చేస్తాయని ఆయన అభిప్రాయ పడ్డారు. జే.సి. సప్లయర్స్ అధినేత సురేష్ ఒక దివ్యాంగుడైన ప్రజా సేవలో అతను చూపించే అంకిత భావం ఎంతో గొప్ప విషయమని, సురేష్ కి ఎల్లప్పుడూ ఎటువంటి సహాయ సహకారం కావాలన్న తాను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రబ్బీ, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి అమరనాథ్ నాయుడు, జిల్లా కార్యదర్శి హేమగిరి చిట్టి, మాజీ ఎంపీపీ రాజమాణిక్యం, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పౌల్, మాజీ సర్పంచ్ హరినాయుడు, నాయకులు బాబు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి బెడ్ షీట్లు వితరణ

పిహెచ్‌సికి బెడ్‌షీట్లు వితరణ చేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలంలోని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగుల సౌకర్యార్థం బెడ్ మ్యాట్రెస్ బెడ్‌షిట్‌లను గంగాధర నెల్లూరు రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో పిహెచ్‌సికి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గౌరి మాట్లాడుతూ ఆస్పత్రిలో బెడ్లు సరిగా లేనందున వైద్యం కోసం వచ్చి రోగులు ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని గంగాధర నెల్లూరు రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం రెడ్ క్రాస్ సంస్థ ద్వారా బెడ్ మ్యాట్రెస్‌లు, బెడ్‌షిట్‌లను అందించారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమస్యలు తెలిపిన వెంటనే స్పందించిన రెడ్ క్రాస్ సంస్థకు వైద్యాధికారి డాక్టర్ గౌరీ, ఆస్పత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ లయన్ వి శ్రీధర్ రెడ్డి , సభ్యులు జమీర్, సాజిద్ బేగ్, ప్రసాద్ రెడ్డి, పాపిరెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి తరానికి మార్గదర్శి బండి రామకృష్ణారెడ్డి
సంస్మరణ సభలో ద్రావిడ విశ్వవిద్యాలయ విసి ఆచార్య ఎం దొరస్వామి

బండి రామకృష్ణారెడ్డి సంస్మరణ సభలో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: జీవితంలో ఎదురైన కష్టాలను జయించి ముందుకు నడిచిన పద్మశ్రీ ఆచార్య బండి రామకృష్ణారెడ్డి నేటి తరానికి గొప్ప మార్గదర్శి అని ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎం దొరస్వామి అన్నారు. వెదురు కుప్పం మండలం మొండి వెంగనపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన ఆచార్య బండి రామకృష్ణారెడ్డి సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ద్రావిడ విశ్వవిద్యాలయానికి వ్యవస్థాపక ఉపకులపతిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయ మన్నారు. ప్రధాన ద్రావిడ భాషలైన తెలుగు, తమిళం , కన్నడం, మలయాళ భాషలకు సమ ప్రాధాన్యం ఇచ్చి అనుగుణంగా శాఖలు ఏర్పాటు చేయడంలో రామ కృష్ణారెడ్డి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆధునిక భాషా శాస్త్రంలో ఆయన చేసిన కృషిని అంతర్జాతీయ భాషా శాస్త్రవేత్తలు గుర్తించడం పలు సందర్భాల్లో ఈయన పరిశోధనను ఉదహరించడం తెలుగు జాతికి గర్వకారణం అన్నారు. ద్రవిడి యన్ లింగిస్టిక్ అసోసియేషన్ పేరుతో బండి రామకృష్ణారెడ్డి ఏర్పాటుచేసిన పరిశోధక మండలి ద్రావిడ భాషా సంస్కృతులకు ఎనలేని సేవ చేసిందని ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ద్రావిడ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఎం హరికృష్ణ అన్నారు. ప్రత్యేక అతిథి డాక్టర్ మురళీ కృష్ణా రెడ్డి, యోగివేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టరు ఎన్ ఈశ్వర రెడి, వైయస్సార్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయ పూర్వ సజీవులు ఎన్ రాజేష్ కుమార్ రెడ్డి ఆయన సేవలను కొనియాడారు. అంతకుముందు రామకృష్ణారెడ్డి కుమార్తె బండి పద్మిని , అల్లుడు నగిరి మడుగు చేతన్ కర్మ క్రియలు పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పూర్వికుల సచివులు ఆచార్య ఎన్ భక్తవత్సల రెడ్డి, తదితరులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం..

మానవహారం నిర్వహించి నినాదాలు చేస్తున్న యువత

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : ఉగ్రవాదాన్ని మట్టికరిపించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికి అయినా కట్టుబడి ఉంటామని కుప్పం పట్టణ కూటమి నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువత ముక్తకంఠంతో నినదించారు. భారత సైన్యం చేసిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం పై స్థానిక యువత ఆనందోత్సవాలు జరుపుకున్నారు. త్రివర్ణ పతాకాలు చేతపట్టి, పట్టణ ప్రధాన రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ కూడలి వద్దకు చేరుకున్నారు. అనంతరం నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, మానవ హారంగా ఏర్పడి 'వందేమాతరం, జైహింద్..' అంటూ నినాదాలు చేశారు. భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ లో కేవలం ఉగ్రవాదుల శిబిరాలను మాత్రమే నేలమట్టం చేశారని, పాకిస్తాన్ లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకపోవడం భారతీయుల ఔదార్యాన్ని చాటుతుందన్నారు.

గుణశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయండి
పోలీసులకు వైసిపి నేతల ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మాజీ మంత్రి ఆర్కేరోజాపై, ఆమె కుటుంబ సభ్యులపై పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా అసత్యపు ఆరోపణలు చేసిన విజయపురం మండలం, కళియంబాకంకు చెందిన తెలుగునాడు ట్రేడ్‌యూనియన్ జిల్లా కార్యదర్శి గుణశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని సీఐ విక్రమ్‌కు వైసిపి నేతలు ఫిర్యాదుచేశారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వారు తమ ఫిర్యాదును సీఐకి అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ అధికారపార్టీ నేతల వద్ద మెప్పుపొందేందుకు గుణశేఖర్‌రెడ్డి తనపై, మాజీ మంత్రి కుటుంబంపైనా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం నీచరాజకీమమే అన్నారు. సంఘంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వారిపై రాజకీయ లబ్ధికి, స్వప్రయోజనాలకు ఆరోపణలు చేస్తున్న గుణశేఖర్‌రెడ్డిని అరెస్టుచేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరామన్నారు. విడివిడిగా అతనిపై కేసులు నమోదుచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మురుగ, నాయకులు కృష్ణమూర్తి, అయ్యప్ప పాల్గొన్నారు.

డిఫర్‌మేషన్ సూట్ వేసిన మాజీ మంత్రి

తనపై, తన కుటుంబంపై అసత్యపు ఆరోపణలు చేసిన గుణశేఖర్ రెడ్డిపై మాజీ మంత్రి ఆర్‌కె రోజా బుధవారం డెఫర్‌మేషన్ సూట్ ఫైల్ చేశారు.

ఘనంగా వాసవి జయంతి

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రంలో నెలకొన్న కన్యక పరమేశ్వరి ఆలయంలో వాసవి జయంతిని ఆర్యవైశ్య సంఘం వారు ఘనంగా నిర్వహించారు. బుధవారం వేద పండితులు గణపతి పూజ, కుంకు మార్చన, హోమాలు నిర్వహించి అమ్మవారికి పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని పిండి నైవేద్యాలతో దీపాలు వెలిగించి వాసవి జయంతి వేడుకలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తిని విశేషా అలంకరణలతో ఉత్సవంపై అధి రోహించి బజారు వీధిలో విహరింప చేశారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆర్యవైశ్య సంఘం వారు భక్తులకు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె రవికుమార్, బద్రీనాథ్, దయ, ఎం జి నాగరాజు, ఎస్ వి సతీష్, ఎస్ ఎల్ ఎం చంద్రశేఖర్,మగీ, యుగంధర్, చలపతి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పర్యవేక్షించిన కమిషనర్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్‌టిసి బస్టాండు సమీపం లోని అన్న క్యాంటీన్‌ను పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్ వి రమణారెడ్డి బుధవారం ఉదయం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్ ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉండడం వల్ల పలమనేరు నియోజకవర్గ ప్రజలే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులు కూడా ఇక్కడ భోంచేసి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలు కను గుణంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆదేశా నుసా రం ప్రారంభించిన అన్న క్యాంటీన్ వల్ల ఎంతోమంది తమ ఆకలిని తీర్చుకుంటు న్నారన్నారు. అందువల్ల క్యాంటీన్ పరిసర ప్రాంతాల్లో, తాగునీరు, స్వచ్ఛత, పరిశుభ్రతపై, క్యాంటీన్‌లో పంపిణీ చేసే ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైం న్యూస్

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పలమనేరు: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పలమనేరు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. చిత్తూరు వైపు వెళ్తున్న ఓ కారు జాతీయ రహదారిపై హరి డాబా వద్ద బైకును ఢీకొంది. ఈ ఘటనలో కల్లుపల్లికి చెందిన మునిరత్నం తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సహకారంతో పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మునిరత్నం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఉద్యోగం రాలేదని మనస్థాపంతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తుంబపాల్యం గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు తుంబ పాల్యం గ్రామానికి చెందిన భాస్కర్ కుమార్తె శశికళ (21) డిగ్రీ విద్యను పూర్తి చేసి గత కొంతకాలంగా వివిధ ఉద్యోగ ప్రయత్నాలు చేపట్టింది. ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురై ఈనెల 5వ తేదీ పిడుదల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి స్పృహ కోల్పోయి పడి ఉండడంతో కుటుంబ సభ్యులు గమనించి బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుడిపాల ఎంపీడీవో శిరీష బాధ్యత స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడివో

ప్రజాశక్తి -గుడిపాల: గుడిపాల ఎంపీడీవో శిరీష ఉద్యోగ బాధ్యతలు బుధవారం స్వీకరిం చారు. అనకాపల్లెలో డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న ఈమె ఉద్యోగోన్నతిపై గుడిపాలకు వచ్చా రు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. వేసవి కాలం కావడంతో ఎక్కడ తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతామని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందిస్తామని తెలిపారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు కార్యాలయ ఏవో కుమార్ లతోపాటు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

వైద్య విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే నివాళి

నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వైద్య విద్యార్థి వెంకటేష్ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ నివాళులర్పించారు. మండలంలోని కోదల మడుగు పంచాయతీ పండు దొడ్డి గ్రామానికి చెందిన సర్పంచ్ మాలతి ప్రతాప్ కుమారుడు వెంకటేష్ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అక్కడికి వెళ్లి నివాళులర్పించి వారి కుటుంబానికి ధైర్యం కల్పించారు. అనంతరం టేకుమంద గ్రామ పంచాయతీ చెందిన వైసిపి నాయకులు రామ్మూర్తి మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, సర్పంచ్ రత్తయ్య, వాణి ప్రియ, రైతు నాయకులు ప్రవీణ్ రెడ్డి, పాలాక్షిరెడ్డి, రాష్ట్ర బీసీ కార్యదర్శి అమర్, బీసీ నాయకుడు మొగలేశ్వర, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, మండల యూత్ అధ్యక్షులు గజేంద్ర పాల్గొన్నారు.

చలివేంద్ర ప్రారంభం

ప్రజాశక్తి- కార్వేటినగరం : మండల పరిధిలోని సురేంద్ర నగరం ఆటో స్టాండ్ వద్ద ఇవోపిఆర్‌డి నాగరత్నమ్మ చేతుల మీదుగా బుధవారం పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చలివేంద్రం ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం గురువారానికి వాయిదా వేశామని ఎంపీడీవో బాలాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి కనీస కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

బొమ్మసముద్రం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపిసి ప్రారంభం

కోర్సులపై ప్రచారం నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -ఐరాల: బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో నూతనంగా బైపిసి కోర్సు అనుమతిస్తూ ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతిక శుక్లా ఉత్తర్వులు ఇచ్చారని, ఎంపీసీ సీఈసీతో పాటు బైపిసి కోర్సులో కూడా ప్రవేశం పొందవచ్చునని, ఒకేషనల్ కోర్సులు ఎం అండ్ ఏటి సిరికల్చర్ లలో కూడా చేరవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ శరత్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాలలో అన్ని వసతులు కలిగి ఉందని, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం ద్వారా 15 వేల రూపాయల స్కాలర్‌షిప్ విద్యార్థులకు ఇస్తారని తెలిపారు. ఇటీవల జరిగిన పరీక్ష ఫలితాల్లోనూ కళాశాల నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ఈ విషయాలను గమనించి విద్యార్థులు బొమ్మసముద్రం కళాశాలలో అడ్మిషన్లకు రావాలని కళాశాల ప్రిన్సిపల్ శరత్ చంద్రశేఖర్ కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని నాణ్యమైన విద్య అందిస్తారని కరపత్రాల ద్వారా గుడిపాల మండలంలోని అన్ని గ్రామాలకు ఇంటి ఇంటికి వెళ్లి అధ్యాపకులు ప్రిన్సిపాల్ అడ్మిషన్ కోసం ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆ కళాశాల అడ్మిషన్ డ్రైవ్ కోసం లెక్చరర్లు రెడ్డప్ప, ఓబులేష్ , జ్యోతి, సెల్వి, శ్రీ హర్ష అందరూ ప్రతి గ్రామ గ్రామానికి వెళ్లి ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

రేషన్ కార్డులు మార్పులు చేర్పులకు అవకాశం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రేషన్ కార్డులు ఉన్న కార్డుదారులకు రేషన్ కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల తహశీల్దార్ అనిల్ బుధవారం తెలిపారు. మండలంలోని రేషన్ కార్డుదారులు కుటుంబ సభ్యుల్ని చేర్చుట, చిరునామా మార్పులు, కొత్త రేషన్ కార్డులు మంజూరు,కార్డులో ఆధార్ నెంబరు మార్పులు చేర్పులు వంటి సేవలను వారి పంచాయతీ పరిధిలోని సచివాలయంలో చేసుకోవచ్చని తెలిపారు. ఈ అన్ని రకాల సేవలను కాల పరిమితితో మంజూరు చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సమీప సచివాలయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్,ఎస్,డిటి రమేష్ ,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్ పాల్గొన్నారు.